www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

**బిజెపి పార్టీ ఆఫీస్ పై కాంగ్రెస్ పార్టీ, ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తల దాడికి నిరసనగా రాస్తారోకో**



4

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 224 | గురువారం | 09- 01 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

# అన్ని రంగాల్లో మద్దతు


- తెలుగులో ప్రసంగం మొదలు పెట్టిన ప్రధాని మోదీ..
- నా ప్రేమాభిమానాలు చూపించే సమయం వచ్చింది
- ఏపీతో భుజం భుజం కలిపి నడుస్తాం
- చంద్రబాబు స్పీచ్‌తో సిక్సర్ కొట్టారు
- విశాఖపట్నంలో ప్రధాని మోదీ



తొలిఅడుగు, విశాఖపట్నం : మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఈ క్రమంలో నేడు విశాఖపట్నంలో రూ. 2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మాట్లాడిన ప్రధాని తన అభిమానాన్ని చూపించే అవకాశం ఇప్పుడు వచ్చిందని పేర్కొన్నారు. తెలుగులో ప్రసంగం మొదలు పెట్టిన ప్రధాని మోదీ.. ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐదేళ్ల తర్వాత ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. చంద్రబాబు స్పీచ్‌తో సిక్సర్ కొట్టారని పేర్కొన్నారు. 60 ఏళ్ల తర్వాత దేశంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మోదీ గుర్తు చేశారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చంద్రబాబు లక్ష్యాలకు మేం ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధాని అన్నారు. ఏపీ ప్రజల ఆశలు, ఆశయాలకు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఏపీకి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నామని, ఏపీతో భుజం భుజం కలిపి 2

## రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల స్క్రీనింగ్..!




తొలిఅడుగు, న్యూఢిల్లీ : దేశంలో హెచ్‌ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైరస్ ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2

## నగదు రహిత చికిత్స



తొలిఅడుగు, న్యూఢిల్లీ : కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా 2

## ఇస్రో కొత్త చైర్మెన్



తొలిఅడుగు, న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కొత్త చైర్మెన్‌గా వీ నారాయణన్‌ను నియమించారు. ప్రస్తుతం ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్ స్థానంలో ఈనెల 14వ తేదీన ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. అంతరిక్ష శాఖ కార్యదర్శిగా కూడా నారాయణన్‌ను నియమించారు. లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ 2

## కార్యకర్తలు హ్యాపీగా లేరు

**మంత్రులు, ఎమ్మెల్యేలు పనితీరును మెరుగుపరచుకోవాలి.. సంక్షేమ కార్యక్రమాల అమలు బాగుంది**



తొలిఅడుగు, హైదరాబాద్ : అధికారం వచ్చి ఏడాది గడిచింది. మీరు పదవులు అనుభవిస్తున్నారు. ఇకనైనా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కార్యకర్తలకు న్యాయం చేయండి.. వారిని కాపాడుకోండి. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసి వారికి అవకాశం కల్పించండి" అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్.. టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం చేశారు. మంత్రులు తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని, వారి పనితీరుకు సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద ఉందని అన్నారు. మంత్రుల పనితీరు పట్ల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల పనితీరు పట్ల పార్టీ కార్యకర్తలూ సంతోషంగా లేరని తెలిపారు. దీనిని సరిదిద్దుకోవాలని సూచించారు. గాంధీభవన్‌లో వారానికోసారి నిర్వహిస్తున్న 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమాన్ని జిల్లాల్లోనూ నెలకోసారి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు, కార్యకర్తలకు దగ్గర కావాలన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను సీఎం రేవంత్‌రెడ్డి, పీఏసీ సభ్యులు వివరించగా.. వాటి అమలుతీరుపై వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు 2


## భారత భూభాగాన్ని ఎవరూ ఆక్రమించలేదు



తొలిఅడుగు, న్యూఢిల్లీ : అంతర్జాతీయ సరిహద్దు వెంబడి 5 కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని బంగ్లాదేశ్ ఆక్రమించిందన్న వార్తలను భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) కొట్టిపారేసింది. బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ) దళాలు 5 కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయంటూ బంగ్లా మీడియాలో వార్తలు వచ్చాయి. అవన్నీ పూర్తిగా బాధ్యతారహిత, నిరాధారమైన కట్టు కథలని బీఎస్ఎఫ్ పేర్కొంది. "ఉత్తర 24 పరగణాల 2

## ఇంటర్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు రద్దు

**ఇంటర్ బోర్డు సంచలన నిర్ణయం**



తొలిఅడుగు, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా బుధవారం (జనవరి 8) సంచలన ప్రకటన చేశారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించాలనే ఏకైక లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇకపై ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలను మాత్రమే నిర్వహించినున్నట్లు ఇంటర్ 2

## ఆ పోలీసుల పేర్లు డైరీలో రాసుకోండి

**వారితోనే మీకు సెల్యూట్ కొట్టిస్తా!**



తొలిఅడుగు, అమరావతి : రాష్ట్ర పోలీసులను ఉద్దేశించి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "పోలీసులు మీపై తప్పుడు కేసులు పెట్టి ..కొట్టి .. హింసిస్తే .. వారి పేర్లను డైరీలో రాసుకోండి .. మనం అధికారంలోకి వచ్చాక .. వారందరి సంగతి తేలుస్తా.కొట్టిన పోలీసులతోనే మీకు సెల్యూట్ కొట్టిస్తా" అని నెల్లూరు జిల్లాకు చెందిన పార్టీ నేతల వద్ద జగన్ వ్యాఖ్యానించారు. తాడేపల్లి నివాస ప్రాంగణంలోని 2

## లొట్టపీసు కేసు లొట్టపీసు ముఖ్యమంత్రి



తొలిఅడుగు, హైదరాబాద్ : ఎన్నో ఎదుర్కొని ఇక్కడి దాకా వచ్చాం. రేవంత్ రెడ్డీ.. కుట్ర కేసులు, కక్షపూరిత చర్యలతో నన్నేం పీకలేవ్' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ పెట్టినప్పుడున్న పరిస్థితి, తెలం గాణ ఉద్యమకారులు పడిన ఇబ్బందులు, అమరవీరుల 2

# అన్ని రంగాల్లో మద్దతు

మొదటిపేజీ తరువాయి నడుస్తామని మోదీ పేర్కొన్నారు. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని ప్రధాని వెల్లడించారు. దీంతోపాటు ఐటీ, టెక్నాలజీకి ఏపీ ప్రధాన కేంద్రం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు ఏపీ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయని ప్రధాని మోదీ అన్నారు. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే మా లక్ష్యమని ప్రధాని తెలిపారు. నవయుగ పట్టణీకరణకు ఏపీ సాక్ష్యంగా మారబోతోందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్ చాలా కాలంగా ఉందని, చిరకాల కోరిక ఈరోజు నెరవేరిందన్నారు. రైల్వే జోన్ రాకతో వ్యవసాయంతోపాటు అనేక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఏపీ అభివృద్ధి మా విజన్ అని మరోసారి గుర్తు చేశారు ప్రధాని మోదీ. 'దేశంలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. అందులో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశాం. 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి బల్క్ డ్రగ్ పార్కులు వస్తున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయి.' అని ప్రధాని మోదీ అన్నారు.

# కార్యకర్తలు హ్యాపీగా లేరు

మొదటిపేజీ తరువాయి సంబంధించిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లడంలేదని, పార్టీ సోషల్ మీడియా వింగ్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. దీనిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యాచరణను అమలు చేయాల్సిందిగా పీసీసీకి సూచించారు. ఇక 2025 సంవత్సరాన్ని పార్టీ సంస్థాగత నిర్మాణ సంవత్సరంగా తీసుకోవాలని వేణుగోపాల్ అన్నారు. బ్లాక్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన సూచన మేరకు నెల రోజుల్లో ఈ కమిటీలను వేయాలని, త్వరితగతిన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని పీఏసీ నిర్ణయించింది. ప్రతి నెలా పీఏసీ సమావేశం నిర్వహించాలన్న నిర్ణయమూ జరిగింది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లోపే ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, లేదంటే ఆ ఎన్నికలపై దీని ప్రభావం పడే అవకాశం ఉందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పీఏసీ సమావేశంలో అభిప్రాయపడ్డారు. కాగా, ఏడాదిపాటు సంవిధాన్ బచావ్ కార్యక్రమాలు తీసుకోవాలని ఇటీవల సీడబ్ల్యూసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని కేసీ వేణుగోపాల్.. పీఏసీలో వివరించారు. దీనికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అయితే ఈ నెల 26 నుంచి 28 మధ్యలో హైదరాబాద్‌లో సంవిధాన్ బచావ్ ర్యాలీని నిర్వహిస్తామని, దానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ సమయం ఇవ్వాలని పీఏసీ సభ్యులు కోరారు.

# రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల స్క్రీనింగ్..!

మొదటిపేజీ తరువాయి

రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలో హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ చేసినట్లు హర్యానా ఆరోగ్య మంత్రి ఆర్తీ సింగ్‌రావు తెలిపారు. హర్యానాలో ఇప్పటివరకు ఒక్క హెచ్ఎంపీవీ కేసు రికార్డవలేదని.. అయితే, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించి ందన్నారు. హెచ్ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్క్రీన్ చేస్తున్నారు. దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాటిని స్క్రీన్ చేయడం తో పాటు పలు రాష్ట్రాల్లో రోగులను ఉంచేందుకు ఐసోలేషన్ వార్డులను సైతం సిద్ధం చేస్తున్నారు. హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలను కలిగిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలంగా లేని వ్యక్తులకు ప్రమాద కరం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధుల తో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది.

# ఆ పోలీసుల పేర్లు డైరీలో రాసుకోండి

మొదటిపేజీ తరువాయి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో మంగళవారం, నెల్లూరు జిల్లా నేతలతో బుధవారం జగన్ సమావేశమయ్యారు. కార్యకర్తలకు అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. లోకసభ నియోజకవర్గం యూనిట్‌గా వచ్చే నెల నుంచి మూడు రోజులు పర్యటనలు చేస్తానని జగన్ ప్రకటించారు. సమావేశంలో ఒక్కొక్కరికీ సగటున మూడు నిమిషాలు సమయం ఇచ్చి వారి సమస్యలు విన్నారు. అనంతరం వారితో విడివిడిగా జగన్ సెల్ఫీలు దిగారు. నెల్లూరు నేతల భుజంపై చేయి వేసి .. భవిష్యత్తులో తోడుగా ఉంటానని చెప్పారు. అయితే, కూటమి సూపర్ సిక్స్ పథకాలపై గతంలో చేసిన ప్రసంగాన్నే తిరిగి వినిపించారు. ఆయన ఉపన్యాస ధోరణిని 'తప్పదు' అన్నట్టు నేతలు భరించినట్టు సమాచారం. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతున్నదనీ, వచ్చే ఎన్నికల్లో తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందని చెప్పే ప్రయత్నం చేసినా..నేతలు చెవికి ఎక్కించుకోలేదని తెలిసింది. పోలీసులపై జగన్ వ్యాఖ్యలకూ పెద్దగా స్పందన కనిపించలేదని చెబుతున్నారు.

# నగదు రహిత చికిత్స

రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అంది స్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పు న ఎక్స్‌గ్రేషియాను అందిస్తామ ని గడ్కరీ తెలిపారు. పలు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ మంగళవారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో మీడియాతో మాట్లా డారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు. మృతుల్లో 66 శాతం మంది 18 నుంచి 34 ఏండ్ల మధ్య వయస్సుగల వారే ఉండటం బాధా కర విషయమన్నారు. ఇక స్కూళ్లు, కాలేజీల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తప్పుల వల్ల 10,000 మంది పిల్లలు చనిపోయారని గడ్కరీ వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల మూడు వేల మంది మరణించినట్లు తెలిపారు.

# లొట్టపీసు కేసు లొట్టపీసు ముఖ్యమంత్రి

త్యాగా లతో పోల్చితే తనకొచ్చిందేమీ ఇబ్బంది కాదన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ 2025 డైరీని మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తనపై పెట్టిన కేసు గురించి పార్టీ శ్రేణులు ఆలోచించాల్సిన అవసరం లేదని, పార్టీ లీగల్ సెల్ ద్వారా న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. రైతులు, ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెసపై బీఆర్ఎస్ శ్రేణులు పోరాడాలని, ఈ ఏడాదిని పోరాట నామ సంవత్సరం చేద్దామన్నారు. ఫార్ములా-ఈ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది ప్రతీకార ధోరణేనని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. ఫార్ములా-ఈ 'ఒక లొట్టపీసు కేసు.. ఆయనొక లొట్టపీసు ముఖ్యమంత్రి' అని విమర్శించారు. 'చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ తయారుచేసిన సైనికుడిని.. కేసీఆర్ రక్తం పంచుకొని పుట్టిన కొడుకుని.. ఈ అక్రమ కేసులకు భయపడతా నా?' అని అన్నారు. తమ భూమి గుంజు కోవద్దన్నం దుకు లగచర్ల రైతులను 40 రోజులు అక్రమంగా జైల్లో పెట్టిన దానితో పోలిస్తే తనపై కేసు పెద్దదేం కాదన్నారు. రైతులు, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. తెలంగాణలో మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తున్నామని కాంగ్రెస్ నేతలు ఢిల్లీలోనూ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఈ ఏడాదంతా రైతన్నలకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు గురించి, ప్రభుత్వం చేస్తున్న అప్పులు, తప్పులు, మోసాలు, సాగునీటి ప్రాజెక్టులపై చేస్తున్న దుష్ప్రచారం గురించి మాట్లాడదామన్నారు.



మొదటిపేజీ తరువాయి

# ఇస్రో కొత్త చైర్మెన్

మొదటిపేజీ తరువాయి

(ఎల్‌పీఎస్సీ) అధిపతిగా ఉన్న నారాయణన్.. రెండేళ్ల పాటు ఇస్రో చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు క్యాబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ మంగళవారం రిలీజ్ చేసిన ఓ నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. స్పేస్ కమీషన్‌కు కూడా ఆయన చైర్మెన్‌గా కొనసాగనున్నారు. క్రయోజనిక్ ఇంజిన్ అభివృద్ధిలో నారాయణన్ కీలక పాత్ర పోషించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సెక్రటరీగా సోమనాథ్ .. జనవరి 14, 2022లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మూడేళ్ల పాటు ఆ విధులను నిర్వర్తించారు. ఇస్రో కొత్త చీఫ్‌గా నియమితుడైన నారాయణన్.. ఇస్రోలో నిష్ణాత శాస్త్రవేత్తగా పేరున్నది. ఆయన సుమారు నాలుగు దశాబ్దాల నుంచి ఇస్రోకు సేవలు అందిస్తున్నారు. విశేష అనుభవం ఉన్న ఆయన.. అనేక కీలక పోస్టుల్లోనూ బాధ్యతలు నిర్వర్తించారు. రాకెట్, స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్సన్ టెక్నాలజీలో నారాయణన్‌కు అద్భుతమైన అనుభవం ఉన్నది.

# భారత భూభాగాన్ని ఎవరూ ఆక్రమించలేదు

మొదటిపేజీ తరువాయి జిల్లా, రాంఘాట్ గ్రామంలోని బాగ్దా బ్లాక్‌లో ఉన్న భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడలియా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి, కంచె వేసి ఉంది. ఈ సరిహద్దు వెంట బీఎసఎఫ్ గస్తీలో ఎలాంటి మార్పు జరగలేదు" అని బీఎసఎఫ్ అధికారిక ప్రకటనలో తెలిపింది. భారత భూభాగాన్ని ఎవరూ ఒక్క అంగుళం కూడా తీసుకోలేదని, తీసుకోలేరని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు కల్పిత కథనాలను ప్రచారం చేస్తున్నాయని ఆరోపించింది.



# ఇంటర్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు రద్దు


మొదటిపేజీ తరువాయి

బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇంటర్ విద్యలో పలు సంస్కరణలు తీసుకొస్తున్నాం. ప్రపంచ స్థాయి పోటీ తట్టుకునే విధంగా ఇంటర్ విద్యార్థులను తయారు చేయాలన్నదే లక్ష్యం. ఇంటర్ మొదటి సంవత్సరం సిలబస్ ఇకపై తెలుగు-ఇంగ్లీషులో ఉంటుంది. సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్ కమిటీ ఈ సిలబస్‌పై దృష్టి పెట్టింది. సిలబస్ వల్ల మాథ్స్, కెమిస్ట్రీలో ప్రస్తుతం ఉన్న సిలబస్ బాగా తగ్గుతుంది. ఇంటర్ లో ప్రతి సబ్జెక్టుకు ఇకపై 20 ఇంటర్నల్ మార్కులు ఉంటాయి. సంస్కరణలకు సంబంధించి ప్రజాభిప్రాయాన్ని తీసుకుంటున్నాం. జనవరి 26 వరకు వెబ్‌సైట్‌లో అభిప్రాయం చెప్పచ్చు. గత కొన్నేళ్లుగా ఇంటర్ బోర్డ్‌లో సంస్కరణలు జరగలేదు. గత కొన్నేళ్లుగా పాఠ్య పుస్తకాల్లో మార్పులు జరగలేదని కృత్తిక శుక్లా ఈ సందర్భంగా వెల్లడించారు.

# ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షునికి సన్మానం



తొలి అడుగు ఇల్లంతకుంట, జనవరి 08 : రాజన్న సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన గౌడుగు నర్సయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు అంతగిరి వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లెపు రజినీకాంత్, యువజన నాయకుడు పున్ని రాజు, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రియాంక గాంధీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

–సాదుల పవన్ కుమార్




తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, జనవరి 08 : కాంగ్రెస్ అధినేత, ఎంపీ ప్రియాంక గాంధీ పై బిజెపి నేత రమేష్ బీదూరి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను నంగునూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. నంగునూరు మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మండలం మాజీ అధ్యక్షులు ఎండి ఇమ్రాన్, సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ లు మాట్లాడుతూ...బిజెపి నేత రమేష్ బేదూరి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలు మహిళ లోకాన్ని అవమానించినట్లేనని, వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అవమానకర వ్యాఖ్యలు వెంటనే వెనక తీసుకోవాలని అన్నారు. రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రిగా ఎన్నో సేవలు దేశ ప్రజలకు అందజేశారని, ఇలాంటి గొప్ప కుటుంబంపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు.

సోనియా గాంధీ కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు ఎవ్వరికీ లేదని, దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబసభ్యులపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. అత్యధిక మెజారిటీతో ఎంపీ గా గెలిచి, తొలిసారిగా పార్లమెంటులో అడుగు పెట్టిన ప్రియాంక గాంధీకి బీజేపీ నేత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బడే అశోక్, బడుగు సదానందం, సిర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నార్థకంగా గ్రామ .మండల కో- ఆర్డినేటర్ల భవితవ్యం

- 18,000 కుటుంబాల గ్రామం మండల కోఆర్డినేటర్ల దుర్భర దుస్థితి
- వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి
- సుమారు 15 ఏళ్లుగా వీధులకు ఎదురుచూపులు
- సాక్షర భారత్ గ్రామ, మండల కోఆర్డినేటర్ల సంఘం జిల్లా కార్యదర్శి దోగ్గల ఉదయ్ కుమార్



తొలి అడుగు, చిన్నకోడూరు, జనవరి 08 : వయోజన విద్యార్థి కేంద్రాలు గత ఎన్నో ఏళ్లగా తెచ్చుకోవడం లేదు. గ్రామ మండల స్థాయి అక్షరాస్యత కార్యక్రమాలను వీధులను నిర్వహిస్తున్న గ్రామ మండల కో-ఆర్డినేటర్లు.ఎం. సి. ఓ.. గ్రామ కోఆర్డినేటర్ల భవితవ్యం కేంద్ర ప్రభుత్వ అనాలోచింతమైన నిర్ణయం వల్ల ప్రశార్థకంగా మారింది సాక్షర భారత్ ద్వారా అక్షరాస్యత కార్యక్రమాల ఆమలు కొనసాగిస్తారనే ఆశలు మళ్లీ చిగురుతాయి.. ఈ సందర్భంగా గ్రామ ,మండల కోఆర్డినేటర్లు సంఘం జిల్లా కార్యదర్శి దొగ్గల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సాక్షర భారత్ ద్వారా పథకం అమలు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ పథకంలో కొనసాగిన వయోజన విద్యా కేంద్రాలు, గ్రామ ,మండల కో-ఆర్డినేటర్ల పరిస్థితి అగమ్య గోచారంగా మారింది. ఈ పథకాన్ని కొనసాగించని కారణంగా ప్రస్తుతం సాక్షర భారత్ కేంద్రాల. వి. సి. ఓ లు,ఎం .సి. ఓ. లు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తామన్నారు..వయోజన విద్యా కేంద్రాలను పునః ప్రారంభించాలి.మళ్లీ యధావిధిగా వయోజన విద్యార్థి కేంద్రాలను. పునః ప్రారంభిస్తుందని ఎన్నో ఏండ్లగా ఆశలతో ఎదురు చూస్తున్నాం. గతంలో ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్య వంతులను చేశాం. గత 15 ఏళు ్లగా కుటుంబాలు గడువగా దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మాపై ప్రత్యేక చొరవ చూపి తక్షణమే వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించి. గ్రామ ,మండల కోఆర్డినేటర్లను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



తొలి అడుగు, ఇల్లంతకుంట, జనవరి 08 : రాజన్న సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఎస్ . రజిత ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఓపి, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించడం జరిగింది. అనంతరం ఏఎన్ఎం లతో ఎన్ సి పి రీస్క్రీనింగ్, ఏఎంసి రిజిస్ట్రేషన్ అన్ని కార్యక్రమాలపై రివ్యూ తీసుకోవడంతో పాటు మాతా శిశు సంరక్షణ, ఆయుష్మాన్ భారత్ నమోదు, టీబి వ్యాధి నిరోధక టీకాలు, తదితర కార్యక్రమాల ద్వారా లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు వెళ్లాలని తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది జిల్లా వైద్యాధికారినినీ సన్మానించారు. తర్వాత పెద్ద లింగాపూర్ లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని సందర్శించి, కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి త్వరలోనే ప్రారంభోత్సవం జరిగేటట్లు చూస్తానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ బి . శరణ్య, డాక్టర్ జే.జీవనజ్యోతి, జిల్లా డిడిఎం కార్తీక్, హెచ్ ఇ ఓ లింగం, సి హెచ్ ఓ శాంత, హెచ్ ఈ ఓ రమణ ప్రసాద్, పిహెచ్ఎన్ తా రాబాయి, హెల్త్ సూపర్వైజర్ జవహర్, ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

# వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అధికారి

తొలి అడుగు, యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ, జనవరి : 08 యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను యాదాద్రి భువనగిరి జిల్లా డీఎంహెచ్ వో డాక్టర్ మనోహర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సిబ్బంది హాజరు పట్టికను, ఫార్మసీ, ల్యాబ్ రికార్డులను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల ఆరోగ్య సేవలను సమీక్షించారు. హాస్పిటల్ కు వచ్చిన పేషంట్స్ తో మాట్లాడారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తుల మందుల నిల్వలను పరీక్షించి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సేవలను మెరుగు పరచడానికి అవసరమైన సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రసిద్ధ్, డాక్టర్ ఉమామహేశ్వరి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది రోగులు తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి పార్టీ ఆఫీస్ పై కాంగ్రెస్ పార్టీ, ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తల దాడికి నిరసనగా రాస్తారోకో



తొలి అడుగు, యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ, జనవరి : 08 భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ పార్టీ, ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తల దాడికి నిరసనగా జిల్లా పార్టీ పిలుపుమేరకు వలిగొండ మండల శాఖ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అంతకుముందు రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సి.ఎన్. రెడ్డి, జిల్లా కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బొడిగే ఆనంద్, బచ్చు శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు కణతాల అశోక్ రెడ్డి, మంద నరసింహ, మైసొల్ల మచ్చ గిరి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి గౌడ్, మండల ఉపాధ్యక్షులు దయ్యాల వెంకటేశం, మండల కార్యదర్శిలు ఎదురుగట్ల వెంకటేశం, మందుల నాగరాజు, యువ మోర్చా జిల్లా పదాధికారులు బుంగమట్ల మహేష్, రేగూరి అమరేందర్, దంతూరి అరుణ్, యువ మోర్చా మండల అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు రామచందర్ యాదవ్, ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి పాతకోట నరేష్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆ మనగంటి శివ, కీర్తి వెంకటేశం, బిక్షం, శీను మరియు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్త బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడిని ఖండిస్తున్నా



తొలి అడుగు, నంగునూరు, జనవరి 08 : హైదరాబాద్ నాంపల్లి లోని బిజెపి రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడిని ఖండిస్తున్నామని బిజెపి ఎస్సీ మోర్చ జిల్లా కార్యదర్శి ముక్క అనిల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తున్నామని చెప్పుకుంటూ కాంగ్రెస్ గుండాల పాలన నడుస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వ దాడులకు బిజెపి కార్యకర్తలు భయపడరన్నారు. కాంగ్రెస్ పార్టీ తాటాకు చప్పుళ్ళకు భయపడే వాళ్ళం కాదని తెలియజేసారు.

# పి.ఆర్.టి.యు. టిఎస్ నూతన క్యాలెండరు ఆవిష్కరణ.



తొలి అడుగు, ఇల్లంతకుంట, జనవరి 08 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ పి.ఆర్.టి.యు. టిఎస్ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మండల అధ్యక్షులు ఐరెడ్డి ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ... పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలని ప్రధాన కార్యదర్శి గుర్రం సందీప్ రెడ్డి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత మేడమ్, సంఘ సీనియర్ బాధ్యులు మోహన్ రెడ్డి మరియు రాష్ట్ర, జిల్లా భాద్యులు నాగరాజు, రాజ్ కుమార్ ,సరోజ ,మంజుల, మధు ,బాబు మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంబరాన్నింటిన చిర్రి పుట్టిన రోజు వేడుక



తొలి అడుగు, జీలుగుమిల్లి : పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పుట్టిన రోజు వేడుక .బుధవారం ఘనంగా జరిగింది. నియోజకవర్గం లో 7మండలాల నుండి కూటమి నాయకుల రాకతో సభా ప్రాంగణం కిక్కిరిసింది.మొదటగా వేద పండితుల వేదమంత్రాల నడుమ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గా ఏజన్సీ టైగర్ కరాటం రాంబాబు,ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్,ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాస్, దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్ రాజు, నియోజకవర్గంలోని అన్ని శాఖలలోని ప్రధాన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.అభిమానులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చిర్రి చారిటబుల్ ట్రస్ట్ నీ ప్రారంభించారు.అలాగే జిల్లా కార్యదర్శి,ప్రధాన కార్యదర్శులు కరాటం సాయి, గడ్డమణుగు రవికుమార్ ఆధ్వర్యంలో సిబిఆర్ న్యూస్ చానెల్ ను ఆవిష్కరించారు.సిబిఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీ లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసారు.ఈ కార్యక్రమం లో జీలుగుమిల్లి మండల అధ్యక్షులు పసుపులేటి రాము,బుట్టాయగూడెం మండల అధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు. పోలవరం మండల అధ్యక్షులు గుణపర్తి చిన్ని,కొయ్యలగూడెం తోట రవి, టి.నరసాపురం అడపా నాగరాజు,కుక్కునూరు మండల అధ్యక్షులు యుగంధర్,వేలేరుపాడు మండల అధ్యక్షులు ఆదినారాయణ, సరిపల్లి సత్యనారాయణ రాజు, నియోజకవర్గం లోని కూటమి నాయకులు కార్యకర్తలు,వీరమహిళలు, నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారుల సిబ్బంది పాల్గొని జయ ప్రదం చేసారు.

## పి ఏ సి ఎస్ నూతన భవనం, గోదాములు ప్రారంభించిన కొండూరి రవీందర్ రావు



తొలి అడుగు, ఇల్లంతకుంట, జనవరి 08 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం లోని రేపాక, కందికట్కూర్ గ్రామాలలో నూతనంగా నిర్మించిన గోదాములను, అలాగే గాలిపల్లి గ్రామంలో పి.ఏ.సి.ఎస్ నూతన భవనాన్ని కే.డి.సి.సి. బ్యాంకు ఛైర్మెన్ కొండూరి రవీందర్ రావు ప్రారంభించారు. రైతులందరికి అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో సొసైటీ గోదాములు ఏర్పాటు చేయడం జరిగిందని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో ప్యాక్స్ ఛైర్మెన్లు, డైరెక్టర్లు, మేనేజర్, కార్యదర్శి, మాజీ సర్పంచులు, మాజీ ఎం పి టి సి లు రైతులు, ప్రజా ప్రతినిధులు వివిధ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి బహిరంగ సభకు తరలివెళ్ళిన ముత్యాలమ్మపాలెం మత్స్యకారులు



తొలి అడుగు పరవాడ జనవరి 8 : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నాయకత్వం లో గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ఆధ్వర్యంలో పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో గల సమ్మంగిపాలెం ,జాలారిపేట ,ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం ,గ్రామాల నుండి 10 బస్సులు ,కార్లు ,బైకులతో ,బయలుదేరిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన మత్స్యకార నేత ,జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు చింతకాయల సూజాత ముత్యాలు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసి అర్జిల్లి దేవిరవి ,మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, మత్స్యకార నాయకులు ,సూరాడ ముత్యాలరావు ,అర్జిల్లి అప్పారావు ,చింతకాయల అప్పారావు ,ఒలిశెట్టి తాతారావు, సమ్మంగి సోమేశ్వరరావు ,ఒలిశెట్టి అప్పలరాజు,సమ్మంగి అప్పలరాజు మరియు సచివాలయం సిబ్బంది, డ్వాక్రా సిఐ లు ,అంగన్ వడి టీచర్ లు , తదితరులు పాల్గొన్నారు.

గురువారం
09 - 01 - 2025

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# సంపాదకీయం

జారుగుబల్లపై రూపాయి పతనం!

భారత బడా బూర్జువా వర్గం, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదంతో రాజీపడి దేశ సహజ వనరులను కట్టబెట్టటమే కాక, దేశ కరెన్సీ అయిన రూపాయి విలువను కూడా అమెరికా సామ్రాజ్యవాదుల దయకు వదిలి వేశా రు. దాని ఫలితమే రూపాయి విలువ పతనమై నేడు డాలర్‌కి 85.7 రూపాయిలుగా ఉంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి నిదర్శనం. అధికార మార్పిడి జరిగిన తర్వాత 1947లో ఒక డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.50 రూపాయల ఉంది.1948 నుండి 1980 వరకు కొంచెం అటుఇటుగా ఉంది. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత రూపాయి విలువ పతనం ఎక్కువగా జరిగింది. అధికార మార్పిడి దగ్గర నుంచి 2022 వరకు రూపాయి విలువ 79 సార్లు పడిపోయింది. నేడు రూపాయి విలువ పతనం తారస్థాయికి చేరింది. సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంపై ఎక్కువగా ఆధారపడటం, నూతన ఆర్థిక విధానాల అమలు, ఎగుమతి, దిగుమతుల్లో ఉన్న వ్యత్యాసం, పెద్ద నోట్ల రద్దు, కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ –రష్యా యుద్ధం, తాజాగా ముడి చమురు ఉత్పత్తిని తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయం రూపాయి విలువ పతనానికి కారణంగా ఉంది. ప్రపంచ చమురు వినియోగించే దేశాల్లో 3వ స్థానంలో ఉన్న భారత్‌కు 85% చమురు దిగుమతిగా ఉంది. చమురే కాకుండా ఫార్మా, టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ తదితర రంగాలకు అవసరమైన ముడిసరుకులు, వంటనూనెలు, ఆహారధాన్యాలు, పప్పులు, లోహాలను భారతదేశం దిగుమతి చేసుకుంటున్నది. ఈ దిగుమతులకు చెల్లింపులు డాలర్లలోనే జరపాలి. రూపాయి విలువ తగ్గిన ప్రతిసారి దిగుమతుల కోసం చెల్లించాల్సిన మొత్తం పెరుగుతూ ఉంటుంది. రూపాయి విలువ పడిపోవటం వల్ల దిగుమతి అయ్యే అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి.ధరల పెరుగుదల భారం ప్రజలపైనే పడుతుంది. డీజిల్ ధరలు పెరిగితే, రవాణా చార్జీలు పెరిగి ఉప్పు, పప్పు, ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి.

అంతేకాకుండా ప్రయాణ ఖర్చులు, ఆటోచార్జీలు, బట్టలు, పిల్లల స్కూలు ఫీజులు, ఫోన్లు, టివిలు, ల్యాప్ టాపుల, వాహనాల ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతుంది. రూపాయి పతనం ఫలితంగా బడ్జెట్ లెక్కలు, అంచనాలు మారిపోతాయి. విదేశాలకు ఎగుమతి చేసే వారికి మాత్రం ఆదాయం పెరుగుతుంది. ప్రపంచ దేశాలపై ఏ దేశ పెత్తనం ఉంటుందో, ఆ దేశ కరెన్సీ ఆధిపత్యం చలాయిస్తుంది. 1947 దాకా ప్రపంచ ఆధిపత్యం బ్రిటన్ చేతుల్లో ఉంది. దాని ఫౌండ్ కరెన్సీ, ఇతర దేశాల కరెన్సీపై ఆధిపత్యం చలాయించింది. బ్రిటన్ బలహీనపడిన తర్వాత అమెరికా ప్రపంచ పోలీసుగా వ్యహరిస్తూ, తన డాలర్ కరెన్సీ ఆధిపత్యాన్ని ఇతర దేశాలపై నెలకొల్పింది. డాలర్ ఆధిపత్యం: చమురును డాలర్లలో చెల్లించాలనే ఒప్పందం కుదరటానికి ముందు అమెరికా కరెన్సీ విలువ ఆ దేశం వద్దనున్న బంగారం నిల్వలతో ముడిపడి ఉంది. 1974 లో సౌదీ అరేబియా తదితర దేశాలు చమురు ఉత్పత్తిని పరిమితం చేయటంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. దీంతో అమెరికా రంగంలోకి దిగింది. సౌదీ అరేబియా డాలర్లలోనే చమురు అమ్మకాలు జరపాలని, మిగులు ఆదాయాన్ని అమెరికా ప్రభుత్వ బాండ్లలో మదుపు చేయాలని, దానికి బదులుగా సైనిక, ఆర్థిక సహాయం అందిస్తామని ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా సౌదీ అరేబియాను తన వ్యూహంలో అమెరికా ఇరికించింది. అప్పటి నుండి చమురు ఉత్పత్తి దేశాల్లో డాలర్లలోనే చమురు విక్రయం కొనసాగింది. ముడి చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలరు ప్రాధాన్యత బాగా పెరిగింది. ముడి చమురుకు అన్ని దేశాలు డాలర్లలో చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రాచుర్యం పొందింది.


అంతర్జాతీయ మార్కెట్లో వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే కొనసాగటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికాకు ఆధిపత్యం ఏర్పడింది. డాలర్ గిరాకీ వల్ల ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే దాని విలువ బాగా పెరిగింది. అందరికీ డాలర్లు అవసరం కాబట్టి, దానినే తన ఆయుధంగా వాడుకునేందుకు అమెరికాకు అవకాశం ఏర్పడింది. ఉక్రెయిన్‌తో యుద్ధం వలన రష్యా మీద ఆర్థిక ఆంక్షలు విధించటం డాలర్ ఆయుధీకరణకు నిదర్శనం. అమెరికాకు ఎదురు తిరిగే దేశాలకు డాలర్లు చిక్కకుండా చేస్తే వాటి ఎగుమతులు, దిగుమతులకు విఘాతం ఏర్పడుతుంది. పెట్టుబడులు ఆగిపోతాయి. డాలర్ మారకంలో ఆయా దేశాల కరెన్సీ విలువ పడిపోయి విదేశీ రుణాలపై అసలు, వడ్డీల చెల్లింపులు మోయలేని భారంగా మారుతుంది. ఆయా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లో భద్రపర్చటం జరుగుతుంది. అందువల్ల అమెరికా తనకు నచ్చిన దేశానికి కావాల్సినంతమేర డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు, నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంకు ఎకౌంట్లను స్తంభింపచేసి డాలర్ల కొరత సృష్టించవచ్చు. ప్రస్తుతం మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నాయి. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి ఉండేలా చేయటానికి కూడా డాలర్ పెత్తనం అమెరికాకు తోడ్పడుతుంది. అమెరికాకు ఆయా దేశాలు చేసే ఎగుమతులు కుదించుకుపోతే, ఆ దేశాల దగ్గర ఉన్న డాలర్ నిల్వలు తరిగిపోతాయి. ఫలితంగా ఇబ్బందులు ఎక్కువ అవుతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు కాని ఇప్పటికే ఆ దేశాలు ఐఎంఎఫ్ లేదా ప్రపంచ బ్యాంకు దగ్గర పొందిన రుణాలు డాలర్లలోనే చెల్లించాల్సిన ఉంది. అప్పుడు డాలర్ల అవసరం ఆ దేశాలకు తప్పదు. ఆ విధంగా ఐఎంఎఫ్ అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని మద్దతుగా ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం డాలర్లలోనే సాగాలనే నిబంధన లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చుకోవచ్చు. డాలర్‌పై ఆధారపడటం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభం చేస్తుంది.

# తెలంగాణ తొలి ఉద్యమ పూర్వాపరాలు

తొలిఅడుగు డెస్క్ :తెలంగాణ ప్రజలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు మాత్రమే పరిష్కారమని, రాష్ట్ర సాధనకై పోరాటం తప్పదనే భావన తెలంగాణ యువతలో అంకురించింది. అలా తెలంగాణ తొలి ఉద్యమం తెలంగాణా హక్కుల పరిరక్షణ ఉద్యమంగా మొదలైంది. తెలంగాణా రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంధ్రనాథ్ గాంధీచౌక్ దగ్గర నిరవధిక దీక్ష ప్రారంభించాడు. తొలి దశ ఉద్యమ ప్రారంభ పూర్వా పరాలు తెలుసుకునే ప్రయత్నం ఇది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు కావడంలో కీలకమైనది పెద్దమనుషుల ఒప్పందం. 1956లో తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఏకమై ఒకే రాష్ట్రంగా ఏర్పడటానికి రాయలసీమ, తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల నాయకులతో కలిసి.1956, ఫిబ్రవరి 20 న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే పెద్దమనుషుల ఒప్పందం. న్యూ ఢిల్లీలో పెద్దమనుషుల ఒప్పందంపై సంతకాలు చేసిన వారు తెలంగాణ తరపున, బూర్గుల రామ కృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావుబీ ఆంధ్ర తరపున నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతు లచ్చన్న ఉన్నారు.

తెలంగాణ అభివృద్ధికి, తెలంగాణ సమానత్వ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు ఏర్పరచు కున్నారు. ఈ ఒప్పందాన్ననుసరించి 1956, నవంబర్ 1 న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ ఒప్పందం అమలు విషయమై కొద్దికాలంలోనే తెలంగాణా ప్రజల్లో అసంతృప్తి తగిలింది. ఒప్పందాన్ననుసరించి ఉప ముఖ్యమంత్రి పదవిని తెలంగాణా వాసికి ఇవ్వలేదుబీ అసలు ఆ పదవినే సృష్టించలేదు. అయితే 1959లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి కాగానే ఉప ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కొండా వెంకట రంగారెడ్డి (కె.వి.రంగారెడ్డి) ని నియమించాడు. అయితే మళ్ళీ 1962 నుండి 1969 వరకు ఉపముఖ్యమంత్రి పదవి లేదు. 1969లో తెలంగాణ ప్రాంతానికి చెందిన జె.వి.నర్సింగరావును ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. ఈ విధంగా రాజకీయ పదవుల విషయంలో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ వారు భావించారు. అలాగే ఆంధ్ర ప్రాంతం నుండి తరలి వచ్చిన ప్రజలు తెలంగాణ ప్రాంతంలో భూములు కొని, వ్యవసాయం చేసారు. ఇది తమ భూముల ఆక్రమణగా కొందరు తెలంగాణా ప్రజలు భావించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయుల నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందనే భావన కూడా తెలంగాణా ప్రజల్లో బలంగా కలిగింది. తెలంగాణ విద్యాసంస్థల్లో కూడా తమకు తగినన్ని సీట్లు రాలేదని విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొని ఉంది. ఈ నేపథ్యం లోనే "తెలంగాణ తొలి ఉద్యమం"... "తెలంగాణ హక్కుల పరిరక్షణ ఉద్యమం"గా మొదలైంది. తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంధ్రనాథ్ గాంధీ చౌక్ వద్ద నిరవధిక దీక్ష ప్రారంభించాడు. ఆరోజు జరిగిన ఊరేగింపులో హింసాత్మక ఘటనలు జరిగాయి. మరుసటి రోజు ఉద్యమం నిజామాబాదుకు పాకింది. జనవరి 10 న హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో – తెలంగాణా రక్షణల అమలుకై జనవరి 15 నుండి సమ్మె చెయ్యాలని ప్రతిపాదించారు. అయితే, జనవరి 13 న అదే విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో విద్యార్థులలోని ఒక వర్గం "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి"గా ఏర్పడి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే తమ ధ్యేయంగా ప్రకటించారు. జనవరి 13న ఉస్మానియా యూనివర్సిటీలో "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి" ఏర్పడింది. ఆ రోజు మొట్టమొదటి సారిగా ప్రత్యేక తెంగాణ సాధనను తమ లక్ష్యంగా విద్యార్థులు ప్రకటించుకున్నారు. విద్యార్థుల కార్యాచరణ సమితి మెడికల్ విద్యార్థి మల్లిఖార్జున్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. విద్యార్థులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం కావాని మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. అదే రోజున పురప్రముఖులు కొందరు "తెలంగాణా పరిరక్షణల కమిటీ"ని ఏర్పాటు చేసారు. జనవరి 18 న విద్యార్థుల్లోని రెండు వర్గాలు (తెలంగాణ రక్షణల కోసం ఉద్యమించిన వారు, ప్రత్యేక తెలంగాణ కోరేవారు) వేరువేరుగా హైదరాబాదులో ఊరేగింపులు జరిపారు. ఈ రెండు ఊరేగింపులు ఆబిడ్స్ లో ఎదురైనపుడు ఘర్షణ చెలరేగింది. పోలీసులు లాఠీఛార్జి చెయ్యవలసి వచ్చింది. అదేరోజు శాసనసభలోని ప్రతిపక్ష పార్టీలు తెలంగాణా రక్షణల అమలు కొరకు ప్రభుత్వాన్ని వత్తిడి చేసాయి. ఉద్యమ కారుల కోరికలను చర్చించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జనవరి 19 న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశం ఒక ఒప్పందానికి వచ్చింది. తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపించాలి. పెద్దమనుషుల ఒప్పందం లోని తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలి. అయితే ప్రత్యేక తెలంగాణ వాదులు ఈ ఒప్పందానికి సమ్మతించలేదు. ప్రత్యేక రాష్ట్రమే తమ ధ్యేయమని, అది నెరవేరే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. జనవరి 24న సదాశివపేటలో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 14 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 17 ఏళ్ల శంకర్ మరుసటి రోజు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. 1969 తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శంకర్. కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని ఏర్పాటు చేశారు. అఖిలపక్ష కమిటీ ఒప్పందాన్ని అమలు చేస్తూ జనవరి 22న ప్రభుత్వం ఒక ప్రభుత్వ ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 28 కల్లా స్థానికులు కాని ఉద్యోగులని వారి వారి స్థానాలకు వెనక్కి పంపివేస్తారు. తెలంగాణ రక్షణల అమలుకై మిగులు నిధుల అంచనాకు ఢిల్లీనుండి ఒక బృందం వస్తుంది. ఈ హామీలతో ఉద్యమానికి ఆద్యుడైన ఖమ్మం విద్యార్థి రవీంద్ర నాథ్ తన దీక్షను విరమించాడు. దీనితో తెలంగాణ రక్షణల అమలు ఉద్యమం ఆగిపోయింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రెండవ దశలోకి ప్రవేశించింది. జనవరి 28న వరంగల్లులో కాళోజీ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని తీర్మానం చేసారు. 1969 ఫిబ్రవరి 28 న యువకులు, మేధావి వర్గాలు కలిసి హైదరాబాదులో తెలంగాణ ప్రజాసమితి ని స్థాపించారు. జూన్ 4న తెలంగాణ పరిస్థితి తీవ్రతను తెలుసుకున్న ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హైదరాబాద్ నగరానికి వచ్చి విద్యార్థి నాయకులు, తెలంగాణ ప్రజా సమితి నాయకులతో చర్చలు జరిపింది. తెలంగాణ తొలి ఉద్యమ కాలంలో మొత్తం 95 సార్లు కాల్పులు జరిగాయి. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో కర్ఫ్యూ విధించారు. ఉద్యమంలో 369 మంది చనిపోగా, ప్రభుత్వ లెక్కలు మాత్రం 57 మంది చనిపోయినట్టుగా చెప్పాయి. తెలంగాణ ప్రజా సమితి నేతతో కేంద్రం చర్చలు జరిపింది. సెప్టెంబర్‌లో చెన్నారెడ్డి ఢిల్లీలో చర్చలు జరిపి వచ్చిన తర్వాత విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని చెన్నారెడ్డి, విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ ఒక ప్రకటన చేశారు. చదువులు కొనసాగిస్తూనే ఉద్యమంలో పాల్గొనాని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ఉద్యోగులను, విద్యార్థును ఉద్యమం నుంచి పక్కకు తప్పించారు. మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజాసమితి 1971 లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో 10 సీట్లు సాధించడం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీకి సంపూర్ణ ఆధిక్యత రావడంతో తెలంగాణా ప్రజాసమితి మద్దతు కీలకం కాకపోవడం,1971 సెప్టెంబర్ 24 న బ్రహ్మానంద రెడ్డి రాజీనామా చేసాక కొద్దిరోజులకు చెన్నారెడ్డి తెలంగాణా ప్రజా సమితిని రద్దు చేయడం, ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడం క్రమానుగతంగా జరిగి పోయాయి. అలా తొలి దశ ఉద్యమం నీరు గారి పోవడం తెలిసిందే... 2001 ఏప్రిల్ 27న కేసిఆర్ నేతృత్వంలోని తెరాస ఉద్యమ పార్టీ ఏర్పాటు కావడం, సుదీర్ఘ మలి ఉద్యమ పోరాటాల, ఆత్మ బలిదానాల ఫలితంగా, భారత ప్రభుత్వం 2 జూన్ 2014 ను తెలంగాణ నిర్మాణ దినంగా ప్రకటించడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరగడం అందరికీ తెలిసిందే.


## జీడిపప్పు తింటే లాభాలు ఉన్నాయా!



తొలిఅడుగు, ఆరోగ్యం : జీడిపప్పు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. అందులోనూ వింటర్ సీజన్‌లో తింటే మరింత మంచిది. జీడిపప్పులో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతో హెల్ప్ చేస్తుంది. ఈ సీజన్‌లో తినడం వల్ల శరీరానికి చాలా మేలు జరుగుతుంది.. వాతావరణంలో కూడా మార్పులు జరుగుతూ ఉంటాయి. ప్రతీ మూడు, నాలుగు నెలలకు ఒకసారి సీజన్ మారుతుంది. సీజన్ మారే క్రమంలోనే శరీరంలో కూడా అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. సీజన్‌కి అనుగుణంగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. లేదంటే శరీరంలో ఇమ్యూనిటీ అనేది తగ్గిపోతుంది. చలికాలంలో వెచ్చగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. ఇలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగు పడుతుంది. చలి కాలంలో ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో జీడిపప్పు ఎంతో హెల్ప్ చేస్తుంది. ప్రతి రోజూ కనీసం నాలుగు పప్పులు తిన్నా ఆరోగ్యానికి మంచిది. వింటర్ సీజన్‌లో పప్పు తినడం వల్ల శరీరానికి వెచ్చదనం వస్తుంది. ఇందులో హెల్దీ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో హెల్ప్ చేస్తుంది. అలాగే శరీరానికి ఎనర్జీని కూడా ఇస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఇమ్యూనిటీ బలపడితే శీతాకాలంలో వచ్చే జ్వరం, దగ్గు, ఫ్లూ వంటివి రాకుండా ఉంటాయి. ఇన్ఫెక్షన్లు, వైరస్‌లు ఎటాక్ చేయవు. చర్మానికి కూడా రక్షణగా నిలుస్తుంది. చర్మం పొడి బారడం తగ్గుతుంది. చర్మం హైడ్రేట్ అవుతుంది. ప్రతి రోజూ నాలుగు పప్పులు జీడిపప్పు తినడం వల్ల శరీరానికి త్వరగా చలి వేయదు. ఎముకలు, కండరాలు బలంగా, దృఢంగా మారతాయి. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. వాపులు వంటివి తగ్గుతాయి. మరీ ఎక్కువగా తింటే సమస్యలు తప్పవు.

# నిమ్మ స్కిన్‌కి మంచిదే.. నేరుగా అప్లై చేస్తే చర్మానికి హానికరమా?

తొలిఅడుగు, ఆరోగ్యం : సిట్రస్ పండ్లలో నిమ్మకాయ ఒకటి. దీనిలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. నిమ్మతో ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో.. అదే విధంగా అందానికి కూడా అంతే ఉపయోగపడుతుంది. అయితే నిమ్మకాయను చర్మానికి అప్లై చేయడం ప్రయోజనకరంగా పరిగణింపబడుతోంది. దీన్ని తినడం లేదా స్కిన్ ని అప్లై చేయడం వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. అయితే చాలా మంది నిమ్మకాయను నేరుగా ముఖంపై అప్లై చేస్తారు..ఇలా చేయడం ప్రయోజనాలకు బదులుగా చర్మానికి హాని కలిగిస్తుంది. ముఖం కాంతివంతంగా, మచ్చలు లేకుండా చేసుకోవడానికి సింపుల్ టిప్స్ నుంచి ఖరీదైన ఉత్పత్తులను కూడా ఉపయోగిస్తారు. ముఖం, చర్మ సౌందర్య కోసం చికిత్స నుంచి అనేక రకాల టిప్స్ ని ఉపయోగిస్తారు. అయితే చర్మంపై ప్రతిదానిని అప్లై చేసే ముందు అందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవడం ముఖ్యం. ఈ రోజు మనం చర్మానికి ఎంతో మేలు చేసే నిమ్మకాయ గురించి తెలుసుకుందాం. నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది.. కనుక ఇది చర్మం మీద ఉన్న మచ్చలను తొలగించడానికి శక్తివంతమైన పదార్థం. అయితే దీనిని అప్లై చేసేటప్పుడు చాలా జాగ్రత్త అవసరం. నిమ్మకాయను ఎప్పుడూ నేరుగా చర్మంపై అప్లై చేయకూడదు. నిమ్మకాయలో విటమిన్లు సమృద్ధిగా ఉండడమే కాదు.. ఇది సహజమైన బ్లీచింగ్‌గా



పనిచేస్తుంది. అందువల్ల చర్మ సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే దీనిలో ఆమ్ల లక్షణాల కారణంగా చర్మంపై నేరుగా అప్లై చేయడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కలుగుతాయి.. ఎందుకు నిమ్మకాయను నేరుగా చర్మంపై ఎందుకు అప్లై చేయకూడదంటే. దురద, దహనం, ఎరుపు సంభవించవచ్చు: నిమ్మకాయను నేరుగా ముఖంపై అప్లై చేయడం వల్ల చర్మంపై దద్దుర్లు ఏర్పడతాయి. దీని వల్ల దురద, మంట, ఎరుపు వంటి సమస్యలు వస్తాయి. అందుకే శనగపిండి, ముల్తానీ మిట్టి, గ్లిజరిన్, కొబ్బరినూనె, కలబంద జెల్ వంటి కొన్ని పదార్థాలతో కలుపుకోవాలి. ఇలా నిమ్మని కొన్ని పదార్థాలతో కలిపి రాయడం వలన చర్మం అందంగా ఉంటుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు ముఖ్యంగా చర్మంపై నేరుగా నిమ్మకాయను అప్లై చేయవద్దు. ఇలాంటి చర్మ తత్వం ఉన్నవారు నేరుగా నిమ్మకయని అప్లై చేస్తే చర్మం వాపు, ఎరుపు, దద్దుర్లు ఏర్పడవచ్చు. ఈ లక్షణాలను తేలికగా తీసుకుంటే సమస్య మరింత పెరుగుతుంది. నిమ్మకాయను నేరుగా చర్మంపై అప్లై చేసినప్పుడు.. స్కిన్ చాలా సున్నితంగా మారుతుంది. దీని కారణంగా సూర్యరశ్మి స్కిన్ కు తాకినప్పుడు వడదెబ్బకు గురవుతారు. హైపర్పిగ్మెంటేషన్ కూడా ఏర్పడవచ్చు. కనుక పొరపాటున కూడా వేసవిలో నిమ్మకాయను నేరుగా చర్మంపై రుద్దకూడదు.

# మీరూ రోజూ పల్లీలు తింటున్నారా? ఈ అలవాటు మీ ఆరోగ్యానికి మేలేనా..



తొలిఅడుగు, ఆరోగ్యం : ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో పల్లీలు ముఖ్యమైనవి. వీటిల్లో పోషకాలు పుష్కలంగా ఉండటమే ఇందుకు కారణం. అందుకే రోజూ వారీ ఆహారంలో వీటిని తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సైతం చెబుతుంటారు. అయితే కొంత మంది తెలిసో.. తెలియకో.. వేయించినవి లేదంటే ఉడికించిన పల్లీలు తింటుంటారు. ఇలా తినడం ఆరోగ్యానికి మంచిదో.. కాదో.. కూడా తెలుసుకోరు.చాలా మంది పల్లీలు ప్రతిరోజూ తింటారు. కొన్నిసార్లు పచ్చి, కొన్నిసార్లు వేయించినవి తింటారు. కానీ ఇలా ప్రతిరోజూ పల్లీలు తినడం వల్ల మీ శరీరానికి తెలియకుండానే ఎంతో మంచి జరిగిందని నిపుణులు అంటున్నారు. వైద్యుల ప్రకారం.. రుచికరమైన, ఆరోగ్యకరమైన స్నాక్స్ జాబితాలో పల్లీలు ముఖ్యమైనవి. ప్రతిరోజూ పల్లీలు తినడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చు. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వు, ఫైబర్, ప్రొటీన్లు ఉంటాయి. వేరుశెనగలు తినడం వల్ల ఒంట్లో మంచి కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ స్థాయి తగ్గించడం గుండెకు ఎంతో మంచిది. గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కాబట్టి గుండె ఆరోగ్యంగా ఉండాలంటే వేరుశెనగ తినడం మంచిది. వేరుశెనగలు రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. కాబట్టి మీకు డయాబెటిస్ ఉంటే వేరుశనగలను భయం లేకుండా తినొచ్చు. వేరుశెనగలో విటమిన్ ఇ, మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. వేరుశెనగలో విటమిన్ ఇ ఉండటం వల్ల జుట్టు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. ఇందులోని యాంటీ-ఆక్సిడెంట్స్ వయస్సు సంబంధిత వ్యాధుల నుంచి కాపాడుతుంది. అయితే బరువు తగ్గాలనుకునే వారు వేరుశెనగలకు దూరంగా ఉండాలి. ఇందులో చాలా కేలరీలు ఉంటాయి. వేరుశెనగలు ఎక్కువగా తినడం వల్ల బరువు పెరుగుతారు. చాలా మందికి వేరుశెనగ తినడం వల్ల ఎలర్జీ కూడా వస్తుంది. ఇలాంటి వారు వీటికి దూరంగా ఉండాలి.


# తొక్క తీయకుండా తింటేనే ఆరోగ్యమట..

తొలిఅడుగు, ఆరోగ్యం : మాంసాహారం కంటే కూరగాయలు తింటే ఆరోగ్యానికి చాలా మంచిదని చాలా మంది చెబుతూ ఉంటారు. కూరగాయలు తినడం హెల్త్‌కి కూడా ఎంతో మేలు. అయితే కొన్ని రకాల కూరగాయలకు తొక్క తీసి తింటారు. అలా వాటికి తొక్క తీసి తినడం వల్ల అనేక పోషక విలువలను కోల్పోతామని న్యూట్రిషియన్లు అంటున్నారు. కూరగాయల్లో ఎన్నో రకాల ఉంటాయి. మనకు నచ్చినవి తెచ్చుకుని తింటూ ఉంటారు. కూరగాయలు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. కూరగాయల్లో ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు చాలా లభిస్తాయి. ప్రతి రోజూ కూరగాయలు తినడం వల్ల ఎలాంటి వ్యాధులు త్వరగా రాకుండా ఉంటాయి. అయితే కొన్ని రకాల కూరగాయల్ని ఎలా తినాలో చాలా మందికి తెలీదు. కొన్నింటికి తొక్క తీసి.. మరికొన్నింటిని నేరుగా వండి తింటూ ఉంటారు. కానీ కొన్ని రకాల కూరగాయల్ని మాత్రం తొక్కతో తింటేనే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలా తింటేనే పోషకాలు అందుతాయని అంటున్నారు. మరి ఆ కూరగాయలు ఏంటో ఇప్పుడే చూసేయండి. బంగాళ దుంపలు:చాలా మంది ఆలు గడ్డలకు తొక్క తీసి వండి తింటూ ఉంటారు. అలా తింటేనే మంచిది అనుకుంటారు. నిజానికి బంగాళ దుంప తొక్కలో కూడా పోషకాలు ఉంటాయి. ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. తొక్కతో తింటే ఎర్ర రక్త కణాల పనితీరును మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థకు కూడా మేలు చేస్తుంది. కాబట్టి శుభ్రంగా కడిగి తొక్కతో తినేందుకు ట్రై చేయండి. బీరకాయలు: తొక్కతో పాటు కలిపి తినాల్సిన కూరగాయల్లో బీరకాయలు కూడా ఒకటి. వీటిని కూడా తొక్కతో తింటేనే మరిన్ని పోషకాలు అందుతాయి. బీరకాయ తొక్కలో కూడా ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అలాగే విటమిన్ సి, పొటాషియం వంటివి కూడా లభిస్తాయి. పొట్టుతో తింటే జీర్ణ వ్యవస్థ, ఎముకలు, గుండె ఆరోగ్యం, ఒత్తిడి కంట్రోల్ అవుతాయి. క్యారెట్లు: క్యారెట్లను కూడా తొక్కతో పాటు తింటేనే ఆరోగ్యం. ఉప్పు, పసుపు వేసి శుభ్రంగా క్లీన్ చేస్తే.. పైన ఉండే మురికి పోతుంది. తొక్క తీయకుండానే క్యారెట్ తినాలి. మందులు వాడుతూ ఉంటారని పైన తొక్క తీసేస్తారు. కానీ దీని వల్ల పోషకాలు తగ్గుతాయి. వంకాయ: చాలా మంది వంకాయకు కూడా స్కిన్ తీసేస్తూ ఉంటారు. ఉప్పు వేసిన నీటితో శుభ్రంగా క్లీన్ చేస్తే.. తొక్క తీయాల్సిన పని ఉండదు. వంకాయను తొక్కతో పాటు తింటేనే ఆరోగ్యానికి మేలు. పైన లేయర్‌లోనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి అనేక పనులను నిర్వర్తిస్తుంది.



తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# రాశిఖన్నా గ్లామర్ సూపరో సూపర్..!



తొలిఅడుగు, , సినిమా : గ్లామర్ షో విషయంలో ఒక్కొక్కరికి ఒక్కో స్టైల్ ఉంటుంది. రాశి ఖన్నా ఫోటో షూట్ చూస్తే అమ్మడి స్టైల్ అర్ధమవుతుంది. ఫాలోవర్స్ కి కావాల్సింది అందిస్తూ వారి అటెన్షన్ ని గ్రాబ్ చేయాలని చూస్తుంది. అందాల భామ రాశి ఖన్నా సౌత్ నార్త్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్ట్ లు చేస్తుంది. తెలుగులో ఐడెంటిటీ వచ్చినా కూడా ఎందుకో దాన్ని సరిగా వాడుకోలేకపోయిందని చెప్పొచ్చు. మద్రాస్ కేఫ్ తో తెరంగేట్రం చేసిన అమ్మడు టాలీవుడ్‌లో ఊహలు గుసగుసలాడే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. అప్పటి నుంచి యంగ్ హీరోలతో కలిసి నటిస్తూ అలరిస్తుంది. ఐతే స్టార్ మెటీరియల్ అయినా కూడా రాశి ఖన్నాకు ఏమాత్రం లక్ ఫేవర్ చేయలేదు. ఎన్టీఆర్, రవితేజ లాంటి స్టార్స్ తో నటించినా సరే ఎందుకో రాశి ఖన్నా స్టార్ రేంజ్ కి వెళ్లలేదు. ఐతే సినిమాలు, సీరీస్ లు ఎలా ఉన్నా కూడా అమ్మడు తన ఫోటో షూట్స్ తో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. లేటెస్ట్ గా రాశి ఖన్నా గ్లామర్ ఫోటో షూట్ సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. గ్లామర్ షో విషయంలో ఒక్కొక్కరికి ఒక్కో స్టైల్ ఉంటుంది. రాశి ఖన్నా ఫోటో షూట్ చూస్తే అమ్మడి స్టైల్ అర్ధమవుతుంది. ఫాలోవర్స్ కి కావాల్సింది అందిస్తూ వారి అటెన్షన్ ని గ్రాబ్ చేయాలని చూస్తుంది అమ్మడు. కచ్చితంగా రాశి కాస్త సీరియస్ గా ట్రై చేస్తే ఇప్పటికి కూడా అమ్మడికి మంచి ఛాన్స్ లు వస్తాయని చెప్పొచ్చు. రాశి ఖన్నా ప్రస్తుతం హిందీ, తమిళ్ సినిమాలతో బిజీగా ఉంది. తెలుగులో పెద్దగా అవకాశాలు లేకపోయినా ఆమె ఫోటో షూట్ విషయంలో సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది.

# ఓ తల్లి ప్రసవ వేదనకి ప్రతిబింబం

తొలిఅడుగు, సినిమా : అరవింద్ కృష్ణ, బిగ్ బాస్ ఫేమ్ దివి, మేఘన శ్రీనివాస్, వినరు కీలక పాత్రల్లో విల్లర్ట్ ప్రొడక్షన్ హౌస్ బ్యానర్‌లో '1000 వర్డ్స్' అనే సినిమా రూపొందింది. ఈ సినిమాకు రమణ విల్లర్ట్ నిర్మాతగా వ్యవహరిస్తూనే డైరెక్షన్ చేశారు. సోమవారం ప్రదర్శించిన స్పెషల్ ప్రీమియర్‌కు రేణూ దేశారు, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చి రెడ్డి, మధుర శ్రీధర్, జ్యోతి పూర్వాజ్, సుకు పూర్వాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా రేణూ దేశారు మాట్లాడుతూ, 'రమణ ఫోటోగ్రాఫర్‌గా నాకు తెలుసు. ఆయన ఓ కథ చెప్పాడు. బాగానే అనిపించింది. కానీ ఎలా తీసి ఉంటారా? అని అనుకున్నాను. ఈ మూవీ చూశాక అద్భుతంగా అనిపించింది. ఇది అందరికీ రీచ్ అవ్వాలి. అందరూ చూడాల్సిన, అందరికీ తెలియాల్సిన సినిమా. ఒక్క ఫోటో మీద ఇంత మంచి కథను రాసుకుని తీశారు. సినిమా చూశాక నాకు కూడా కన్నీళ్లు వచ్చాయి. రమణకి ఇది ఆరంభం మాత్రమే. ఆయన్నుంచి ఇంకా ఇలాంటి మంచి చిత్రాలు రావాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'ఓ తల్లి బిడ్డను కనేప్పుడు పడే బాధను చెప్పాలని, చూపించాలనే ఈ సినిమాను తీశాం. అరకులో పూర్తిగా షూట్ చేశాం. నేను మొదటి ప్రయత్నం చేశాను. చూసిన వారంతా తప్పులు చెప్పండి. వాటిని తెలుసుకుని సరిదిద్దుకుంటాను' అని డైరెక్టర్, నిర్మాత రమణ విల్లర్ట్ అన్నారు



# ఆగం చేయకండి..
# అమెరికా ఫ్యాన్స్ కు బాలయ్య హెచ్చరిక..

తొలిఅడుగు, , సినిమా బాలకృష్ణ డాకు మహారాజ్ సినిమాతో సంక్రాంతికి రాబోతున్నారు.సాధారణంగా ఫ్యాన్స్ తమ ఫేవరేట్ హీరోల సినిమాలకు థియేటర్స్ లో ఏ రేంజ్ అల్లరి చేస్తారో తెలిసిందే. పేపర్లు ఎగరేయడాలు, కటౌట్స్, పాలాభిషేకాలు, బ్యానర్లు, టపాసులు.. ఇలా థియేటర్స్ వద్ద రచ్చ చేస్తారు. థియేటర్ లోపల కూడా పేపర్స్ ఎగరేసి, ఫైర్ క్రాకర్స్ తో హడావిడి చేస్తారు. అయితే అమెరికా వెళ్లినా మన వాళ్ళు మారకుండా అక్కడ కూడా ఇలాగే చేస్తున్నారు. గతంలో చాలా సినిమాలకు అమెరికాలో మన తెలుగు వాళ్ళు చేసిన రచ్చ వీడియోల రూపంలో వైరల్ గా మారాయి. ముఖ్యంగా బాలయ్య సినిమాలకు అయితే హడావిడి ఓ రేంజ్ లో ఉంటుంది. గతంలో అఖండ సినిమాకు తమన్ కొట్టిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కి, ఫ్యాన్స్ చేసిన రచ్చ కు అక్కడ థియేటర్స్ లో ఊఫర్స్ పేలిపోయాయి. అప్పట్లో ఈ విషయం పెద్ద రచ్చ అయింది. దీంతో దీనిపై బాలయ్య తాజాగా స్పందించారు. బాలకృష్ణ డాకు మహారాజ్ సినిమాతో సంక్రాంతికి రాబోతున్నారు. జనవరి 12న ఈ సినిమా రిలీజ్ కానుంది. దీనికి సంబంధించి అమెరికాలో కూడా ఇటీవల ప్రమోషన్స్ చేసారు. అమెరికాలో డాకు మహారాజ్ ఈవెంట్ నిర్వహించగా అక్కడ బాలయ్య ఫ్యాన్స్, తెలుగువాళ్లు భారీగా హాజరయ్యారు.ఈ ఈవెంట్లో బాలకృష్ణ మాట్లాడుతూ.. అఖండ జాతర అమెరికా నుంచే మొదలైంది. ఇక్కడే ఊఫర్స్ బ్లాస్ట్ అయ్యాయి. కాని నేను ఒకటే చెప్తున్నా మనం ఎక్కడున్నాం ఏం చేస్తున్నాం అనేది గమనించి అప్రమత్తంగా ఉండాలి. ఇక్కడివాళ్లకు కూడా మన సహాయసహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. మనకు ఇండియాలో అలవాటు కాగితాలు ఎగరేయడం, ఫైర్ లాంటివి. కానీ ఇక్కడ అవి న్యూసెన్స్ అన్నట్టు ఉంటుంది.



# మనకి గేమ్ ఛేంజర్ ఉంది తాతయ్య
# దిల్ రాజుకి మనవడి కాల్

తొలిఅడుగు, సినిమా ఒకప్పుడు టాలీవుడ్ మోస్ట్ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్లలో ఒకడిగా ఉండేవాడు దిల్ రాజు. ప్రతి సినిమాతో హిట్టు కొట్టడం ఎవరికీ సాధ్యం కాదు కానీ.. రాజు ఉన్నంతలో మంచి సక్సెస్ రేట్‌తో సాగిపోయేవాడు. ఒక సినిమా తేడా కొట్టినా ఇంకో చిత్రంతో హిట్టు కొట్టేవాడు. ఆయన ప్రొడ్యూస్ చేసిన సినిమా అయినా, డిస్ట్రిబ్యూట్ చేసిన చిత్రమైనా ప్రేక్షకులకు ఒక గురి ఉండేది. అందుకే టాలీవుడ్లో రాజును జడ్జిమెంట్ కింగ్ అని పిలిచేవారు. కానీ గత కొన్నేళ్లలో ఆయన ఇమేజ్ డ్యామేజ్ అయింది. రౌడీ బాయ్స్, ఎఫ్-3, థాంక్యూ, వారిసు, శాకుంతలం, ఫ్యామిలీ స్టార్.. ఇలా వరుసగా ఆయన్నుంచి




నిరాశాజనకమైన చిత్రాలు వచ్చాయి. ముఖ్యంగా థాంక్యూ, శాకుంతలం, ఫ్యామిలీ స్టార్.. దిల్ రాజు జడ్జిమెంట్‌ను ప్రశ్నార్థకం చేశాయి. వీటిలో 'ఫ్యామిలీ స్టార్' సినిమా ఫలితం తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టినట్లు, అంతర్మథనంలోకి నెట్టినట్లు దిల్ రాజు తెలిపాడు."ఫ్యామిలీ స్టార్ రిజల్ట్ చూసి చాలా డిజప్పాయింట్ అయ్యాను. అప్పుడు ఏడేళ్ల నా మనవడు ఫోన్ చేసి డిజప్పాయింట్ అవ్వకు, నీ చేతిలో గేమ్ చేంజర్ ఉంది, దాంతో కొడతావ్ అన్నాడు. అది నాకు చాలా ఎమోషనల్‌గా అనిపించింది. అప్పుడే నేను ఒక ఛేంజ్ తీసుకున్నాను. ఎలా ఇన్‌స్పైర్ కావాలి, ఎక్కడ పట్టుకోవాలని అనే ఆలోచన మొదలైంది. సన్నిహితులు, శ్రేయోభిలాషులతో మాట్లాడే క్రమంలో అనుకున్న విధంగా సినిమాలు తీయలేకపోతున్నామయని అన్నారు. నాలో భయం మొదలైంది. స్టోరీ జడ్జ్‌మెంట్ పోయిందా? మళ్లీ కాంబినేషన్‌లకే వెళ్లాలా? అని ఆలోచించటం మొదలు పెట్టాను. శిరీష్ అయితే ఓవర్ లోడ్ కారణంగా సరిగా దృష్టిపెట్టలేకపోతున్నానని అన్నాడు.

# చాంపియన్స్ ట్రోఫీలో కేఎల్ రాహుల్, షమీకి చోటు దక్కేనా..?

తొలిఅడుగు డెస్క్ : ఏడాది పాకిస్థాన్ వేదికగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ జరగనున్నది. ఈ మెగా ఈవెంట్‌కు బీసీసీఐ రేపో మాపో జట్టును ప్రకటించనున్నది. జట్టును ప్రకటించేందుకు ఈ నెల 12 వరకు అవకాశం ఉన్నది. ఫామ్‌లో లేని కెప్టెన్ రోహిత్ శర్మ, సీనియర్ క్రికెటర్ విరాట్ వన్డే జట్టులో చోటు దక్కనున్నది. అయితే, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ జట్టు ఎంపిక కోసం ముగ్గురు సీనియర్ ఆటగాళ్లపై చర్చించే అవకాశం ఉన్నది. ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ మొదలవనున్న నేపథ్యంలో కేఎల్ రాహుల్, మహ్మద్ షమీ, జడేజాలను తీసుకుంటారా? లేదా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. చివరగా 2023లో జరిగిన ప్రపంచకప్ జట్టులో ముగ్గురికి వరల్డ్ కప్‌లో చోటు దక్కింది.

షమీ, జడేజాలకు విశ్రాంతి..

వరల్డ్ కప్ తర్వాత షమీ, జడేజాలకు బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. ఆ తర్వాత టీమిండియా కేవలం ఆరు వన్డేలు మాత్రమే ఆడింది. అయితే, కేఎల్ రాహుల్ మాత్రం దక్షిణాఫ్రికా, శ్రీలంకతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో చోటు దక్కింది. శ్రీలంకతో సిరీస్‌లో రాహుల్‌ను మధ్యలోనే జట్టు నుంచి తప్పించింది. 2023 నవంబర్ 19న వరల్డ్ కప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 107 బంతులు ఆడిన రాహుల్.. కేవలం 66 పరుగులు మాత్రమే చేయడమే ప్రధాన కారణం. ఇక యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ వన్డే జట్టులో చోటు దక్కించుకునే అవకాశాలున్నాయి. టాప్ ఫోర్‌లో ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్‌కు బెర్త్ దాదాపు ఖాయంగా కనిపిస్తుంది.

వికెట్ కీపర్‌గా పంత్‌కే ఛాన్స్..

చాంపియన్స్ ట్రోఫీలో వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ వైపే సెలెక్టర్లు మొగ్గు చూపే అవకాశం ఉంది. రాహుల్ వికెట్ కీపింగ్ చేయకపోతే బ్యాట్స్‌మెన్‌గా జట్టులో స్థానం అనుమానమే. మరో వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ విజయ్ హజారే ట్రోఫీలో పరుగులు చేయడంలో విఫలమయ్యాడు. కోచ్ గౌతమ్ గంభీర్ సెలక్షన్ విషయాల్లో తనదైన శైలిని కొనసాగిస్తే.. సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌తో పాటు కుల్దీప్ యాదవ్ ఫిట్‌నెస్‌పై సెలెక్టర్లు కన్నేశారు. పూర్తిగా ఫిట్‌గా ఉన్నా.. విజయ్ హజారే ట్రోఫీలో ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేదు. కుల్దీప్‌ను పక్కన పెట్టాలని భావిస్తే.. రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తిలో ఒకరికి అవకాశం దక్కే ఛాన్స్ ఉంది.

షమీ ఫిట్‌నెస్‌పై ఆందోళన..

ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ ఫిట్‌నెస్ విషయంలో ఇంకా స్పష్టత లేదు. విజయ్ హజారే ట్రోఫీలో చివరి రెండు మ్యాచుల్లో ఎనిమిది ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. జస్ప్రీత్ బుమ్రా వెన్నునొప్పితో బాధపడుతున్నారు. బుమ్రా దూరమైతే మాత్రం షమీ అనుభవం టీమిండియాకు ఉపకరించే అవకాశం ఉంది. రిజర్వ్ బ్యాట్స్‌మెన్‌లలో రింకు సింగ్, తిలక్ వర్మల్లో ఒకరిని ఎంపిక చేసే అవకాశం ఉంది.



చాంపియన్స్ ట్రోఫీకి జట్టు (అంచనా) : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభమన్ గిల్, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, రిషబ్ పంత్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి / రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, అవేష్ ఖాన్ / మహమ్మద్ షమీ, రింకూ సింగ్ / తిలక్ వర్మ.


## బాంబ్రీ క్వార్టర్స్‌కు.. బాలాజీ ఇంటికి




తొలిఅడుగు, ఢిల్లీ: న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఏటీపీ టూర్స్ (టెన్నిస్)లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. ఆక్లాండ్ (న్యూజిలాండ్) వేదికగా జరుగుతున్న ఏఎస్‌బీ క్లాసిక్ టోర్నీలో యుకీ బాంబ్రీ-అల్బనో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం.. 6-4, 6-4తో సాండర్ అరెండ్స్-లూక్ జాన్సన్ (పారిస్)ను ఓడించి క్వార్టర్స్ చేరింది. ఇక అడిలైడ్ (ఆస్ట్రేలియా) ఇంటర్నేషనల్ టోర్నీ ప్రిక్వార్టర్స్‌లో బాలాజీ-రెయిస్ జోడీ.. 6-3, 3-6, 11-13తో హెలివార-హెన్రీ (మెక్సికో) చేతిలో ఓటమిపాలైంది.

# క్రికెట్‌కు గప్టిల్ వీడ్కోలు

తొలిఅడుగు, ఆక్లాండ్: న్యూజిలాండ్ వెటరన్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2009లో జాతీయ జట్టులోకి వచ్చిన గప్టిల్.. బుధవారం 14 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. చివరిసారిగా కివీస్ తరఫున 2022లో ఆడిన అతడు.. మూడు ఫార్మాట్లలో కలిపి 367 మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహించాడు. న్యూజిలాండ్ తరఫున వన్డేలలో ద్విశతకం చేసిన తొలి క్రికెటర్‌గా రికార్డులకెక్కిన ఈ విధ్వంసక ఓపెనర్.. 198 వన్డేలు, 122 టీ20లు, 47 టెస్టులు ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి గప్టిల్ ఖాతాలో 23 శతకాలున్నాయి. వన్డేలలో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్లలో న్యూజిలాండ్ నుంచి రాస్ టేలర్, స్టీఫెన్ ఫ్లెమింగ్ తర్వాత గప్టిల్ మూడోస్థానం (7,346)లో ఉన్నాడు. టీ20లలో 3,533 పరుగులతో కివీస్ నుంచి మొదటి స్థానంలో నిలిచాడు.



## బాక్సింగ్‌లో కొత్త బరువు విభాగాలు

తొలిఅడుగు, బరేలి: ప్రపంచ బాక్సింగ్ కొత్త తీసుకొచ్చిన బరువు విభాగాలను భారత బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్ఐ) అమలు చేయబోతున్నది. జాతీయ పురుషుల టోర్నీ ద్వారా కొత్త కేటగిరీలతో పోటీలను నిర్వహిస్తున్నది. గతంలో ఉన్న 13 విభాగాలను వరల్డ్ బాక్సింగ్ పదింటికి కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో కొత్త బరువు విభాగాలు 50కి(ఫ్లై వెయిట్), 55కి(బాటమ్‌వెయిట్), 60కి(లైట్‌వెయిట్), 65కి(వెల్టర్‌వెయిట్), 70కి(లైట్ మిడిల్‌వెయిట్), 75కి(మిడిల్‌వెయిట్), 80కి(లైట్ హెవీవెయిట్), 85కి(క్రూజర్‌వెయిట్), 90కి(హెవీ వెయిట్), 90౦కి(సూపర్ హెవీవెయిట్)గా ఉన్నాయి. వీటిలో ఆరు 55కి, 60కి, 65కి, 70కి, 80కి, 90కిలను ఒలింపిక్ కేటగిరీలుగా పేర్కొన్నారు. అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్(ఐబీఏ) గుర్తింపు కోల్పోయిన తర్వాత గత ఎప్రిల్‌లో వరల్డ్ బాక్సింగ్ కొత్తగా మొదలైంది. ఇప్పటికే 60 మంది సభ్యుల మద్దతు కూడగట్టిన వరల్డ్ బాక్సింగ్..ఐవోసీ గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నది.

## 12 ఏండ్లలో అత్యల్పం

తొలిఅడుగు, దుబాయ్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో పేలవ ఫామ్‌తో ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొంటున్న భారత దిగ్గజ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తాజాగా ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో మరింత దిగజారారు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్ జాబితాలో కోహ్లీ.. మూడు స్థానాలు దిగజారి 27వ ర్యాంక్‌కు పడిపోగా రోహిత్‌శర్మ 42వ స్థానంలో ఉన్నాడు. గడిచిన 12 ఏండ్ల కాలంలో టాప్-25లో లేకపోవడం కోహ్లీకి ఇదే తొలిసారి. 2012 డిసెంబర్‌లో కోహ్లీ చివరి సారిగా 36వ ర్యాంకులో ఉన్నాడు.

ఆస్ట్రేలియాతో సిరీస్‌లో పెర్త్ టెస్టు సెంచరీ మినహా మిగిలిన 8 ఇన్నింగ్స్‌లో కోహ్లీ చేసింది 90 పరుగులే. ఆఫ్‌స్టంప్ అవతల వెళ్తున్న బంతులను వేటాడి బలైన కోహ్లీ.. ఆసీస్ పేసర్ స్కాట్ బొలాండ్‌కు నాలుగు సార్లు ఇదే రూపంలో వికెట్ సమర్పించుకున్నాడు. ఇక గతేడాది స్వదేశంలో బంగ్లాదేశ్ సిరీస్‌కు ముందు ఆరో స్థానంలో ఉన్న రోహిత్ ర్యాంకు క్రమంగా దిగువకు పడిపోయింది. న్యూజిలాండ్‌తో 3 మ్యాచ్‌ల సిరీస్ తర్వాత 26కు పడిపోయిన హిట్‌మ్యాన్ ర్యాంకు.. తాజాగా 42వ ర్యాంక్ వద్ద నిలిచింది. ఈ జాబితాలో టాప్-10లో నిలిచిన బ్యాటర్లలో భారత్ నుంచి యశస్వీ జైస్వాల్ (4), రిషభ్ పంత్ (9) ఉన్నారు.